స్పందన తెలుగు దినపత్రిక



## చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి రూ.10 వేల కోట్లతో నిధి

(మొదటిపేజీ తరువాయి)

ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ అథారిటీ(ఐటీఎల్ఏ) పేరిట ప్రత్యేక సంస్థ (ఎస్పీవీ) ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. తయారీ, సేవా, సాంకేతిక, ఆవిష్కరణల రంగాల్లోని చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి మూలధనాన్ని(గ్రోత్ క్యాపిటల్) సమకూర్చడమే లక్ష్యంగా ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్‌ను తీసుకొచ్చారు. 2026--27 కేంద్ర బడ్జెట్‌లో చేసిన ప్రకటన మేరకు ఈ నిధికి రూపకల్పన చేశారు. వివిధ రవాణా మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీల మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని నివారించి, మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అపెక్స్ సంస్థగా 'ఐటీఎల్ఏ'ను ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ తరహాలో ఏర్పాటు చేయబోతున్నారు. రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, షిప్పింగ్, పౌర విమానయానం, జలమార్గాలు, కోస్టల్ షిప్పింగ్, పట్టణ రవాణాను కలుపుతూ పదేళ్ల భవిష్యత్ ప్రణాళికతో సమగ్ర 'నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ మాస్టర్ ప్లాన్'ను ఐటీఎల్ఏ సంస్థ తయారు చేస్తుంది. ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కేంద్ర మంత్రివర్గం అభినందనలు తెలియజేసింది. 2001 అక్టోబర్‌లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రజా నాయకుడిగా ఆయన అందిస్తున్న సేవలను కొనియాడింది. ఈ మేరకు మోదీ నాయకత్వాన్ని ప్రశంసిస్తూ మంగళవారం కేబినెట్ భేటీలో ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్యమంత్రి స్థాయి నుంచి ప్రధాని స్థాయి వరకు మోదీ నాయకత్వ పటిమ ఏమాత్రం చెక్కుచెదరలేదని ఉద్ఘాటించారు.



## సింగరేణిలో నెహ్రూ హౌసింగ్ కాలనీలు

(మొదటిపేజీ తరువాయి)

గండ్ర సత్యనారాయణరావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, గడ్డం వినోద్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించిన పలు విజ్ఞప్తులను సానుకూలంగా విని తక్షణ చర్యలకు ఆదేశాలిచ్చారు. ఆక్రమణలో ఉన్న నివాసితుల ప్రాథమిక జాబితా తయారీ ప్రక్రియను నెలలోపు పూర్తిచేయాలని భట్టి ఆదేశించారు. ఇంతవరకు మైనింగ్ చేయని ప్రదేశాలను గుర్తించి ఉద్యోగులు, కార్మికుల ఇళ్ల నిర్మాణం కోసం లేఅవుట్ చేసి నెహ్రూ హౌసింగ్ కాలనీ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులుగా తీర్చిదిద్దాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 300 వరకు డిపెండెంట్ ఉద్యోగుల ఆర్డర్లను రాబోయే 15 రోజుల్లో పూర్తిచేసి అభ్యర్థులకు అందజేయాలని ఆదేశించారు. డిపెండెంట్ ఉద్యోగుల పేర్ల మార్పులకు సంబంధించిన సమస్యలపై అధికారులు మానవీయ కోణంలో ఆలోచించి, అధికారుల కమిటీ ఇచ్చిన సిఫార్సులు ఆధారంగా తగిన నిర్ణయం తీసుకోవాలని భట్టి సూచించారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు ప్రయాణించాల్సిన అవసరం లేకుండా, అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత తేదీన బోర్డు మీటింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

# 45 ఎకరాల లెక్క తేల్చండి

(మొదటిపేజీ తరువాయి)

కొలతలు- దస్త్రాల నిర్వహణ శాఖలు నిర్వహించిన విచారణపై హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి మంగళవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, భూ అక్రమాలపై విచారణకు వేసిన కమిటీ, ధరణి అక్రమాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ పురోగతిపై కమిటీ సభ్యులను సీఎం ప్రశ్నించారు. సమీక్షలో పాల్గొన్న అధికారులు సీఎం దృష్టికి క్షేత్రస్థాయి విచారణ వివరాలను వెల్లడించారు. "ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉంది. తాజా సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించాం. రికార్డుల్లో ఉన్నదానికి, వాస్తవంగా ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉంది. సర్వే నంబరు 325 సమీపంలోనే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున, వారి భూముల రికార్డులను సమర్పించాలని నోటీసులు జారీ చేస్తాం" అని అధికారులు అన్నారు. స్పందించిన సీఎం.. ఆ 45 ఎకరాల భూమిని తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే నంబరు 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 'తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం తెలంగాణ అమరవీరుల కాలనీని అక్కడ నిర్మించాలి. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో కాలనీని అభివృద్ధి చేయాలి. నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ



శాఖకు అప్పగించాలి. వచ్చే జూన్ 2లోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. కొండపాక మండలం వెలికట్ట గ్రామ పరిధిలో ఎసైన్డ్ భూములు, మిషన్ భగీరథ భూములు మినహా మిగిలిన భూముల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తోపాటు ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటు చేయాలి. ఎల్‌నినో నేపథ్యంలో రిజర్వాయర్లు, చెరువుల నీటిని జాగ్రత్తగా వినియోగించాలి. మల్లన్నసాగర్ నీటిని అనధికారికంగా వినియోగించే వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

### జూన్ 2లోగా అమర వీరుల కాలనీ

ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదైందని, కానీ తాజా సర్వేలో 343 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు గుర్తించామని సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు వివరించారు. రికార్డులో ఉన్న భూమికి, వాస్తవంగా ఉన్న భూమికి మధ్య 45 ఎకరాల వ్యత్యాసం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ 45 ఎకరాల భూమిని తేల్చేందుకు ఎర్రవల్లి, శివారు వెంకటాపురం గ్రామాల్లో సర్వేకు నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సర్వే నంబర్ 325 సమీపంలోనే కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు భూములు ఉన్నందున, వారి భూముల రికార్డులను సమర్పించాల్సిందిగా నోటీసులు జారీ చేస్తామని అధికారులు సీఎంకు వివరించారు. సర్వే నంబర్ 325లో గుర్తించే భూమిని స్థానికంగా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అలాగే, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాల కోసం 'తెలంగాణ అమరవీరుల కాలనీ'ని ఇదే ప్రాంతంలో నిర్మించాలని సీఎం ఆదేశించారు. అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలతో ఫాంహౌస్ ఎదురుగా కాలనీని అభివృద్ధి చేయాలని సూచించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖకు అప్పగించాలని, వచ్చే జూన్ 2లోగా తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మాణాన్ని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# అమరులు కోరుకున్న సమాజాన్ని నిర్మించాలి.

**చందుర్తి/వేములవాడ :**

అమరులు కోరుకున్న సమాజాన్ని నిర్మించడమే వారికి మనమిచ్చే సరైన నివాళి అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. చందుర్తి మండలం సనుగులలో మంగళవారం నిర్వహించిన అమరుల యాది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సబ్బండ వర్గాలు, కులాలకు అధికారంలో భాగస్వామ్యం దక్కినప్పుడే అమరుల త్యాగాలకు ఫలితం ఉంటుందన్నారు. సమాజం కోసం ఓ వ్యక్తి తన ప్రాణాలు లెక్క చేయకుండా పోరాటం చేస్తుంటే ఆ కుటుంబ సభ్యుల పరిస్థితి ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ నిమ్స్ లో 11 రోజుల పాటు నిరాహార దీక్ష చేస్తున్నప్పుడు కుటుంబ సభ్యులుగా ఎంత నరకయాతన అనుభవించామో తనకు మాత్రమే తెలుసన్నారు. కేసీఆర్ తో ఇప్పుడు రాజకీయంగా విబేదించినా, దారులు వేరైనా సమాజం కోసం ఆయన చేసిన త్యాగాన్ని మాత్రం మర్చిపోవద్దన్నారు. అదే విధంగా తెలంగాణ కోసం అమరులైన వారిని, మంచి సమాజం కోసం అప్పట్లో ఈ ప్రాంతంలో అసువులు బాసిన నక్సల్స్ ను గుర్తు చేసుకోవాల్సిన అవసరముందన్నారు. వారు ఆకాంక్షించిన సమాజాన్ని నిర్మించాల్సి ఉందని చెప్పారు. అమరుల త్యాగాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో



ఆ ఫలాలు నిజంగా అందరికీ దక్కాయా అన్నది సమీక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ వచ్చి 13 ఏళ్లు గడిచినప్పటికీ ఇప్పటికీ పేదవాళ్లు మెరుగైన విద్య, వైద్యం కోసం పోరాడుతునే ఉన్నారని.. ఇదేనా మనం కోరుకున్న తెలంగాణ అని ప్రశ్నించారు. ఆనాడు భూస్వాములు, దొరలపై పోరాడితే.. ఇప్పుడు అధికారం అడ్డం పెట్టుకొని దోచుకుంటున్న వాళ్లపై పోరాటం చేస్తున్నామన్నారు. దోపిడీ విధానం మారిందే తప్ప వారిలో ఆ స్వభావం మారలేదని.. అది మారాలంటే నిరంతరం పోరాటం చేయాలన్నారు. యువత, మహిళలు రాజకీయాల్లోకి వస్తేనే పరిస్థితి మారుతుందన్నారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

### కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టుపై ఖండన

**హైదరాబాద్:** ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంతో కేంద్ర ప్రభుత్వం వణికిపోతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అస్తవ్యస్తంగా మారిన 'సర్' రద్దు, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసేవరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించబోదని స్పష్టంచేశారు. దేశ భవిష్యత్తును రక్షించేందుకు రాహుల్ చేస్తున్న పోరాటంలో ప్రజలు, యువత స్వచ్ఛందంగా భాగస్వాములవుతున్నారనే విషయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను పోలీసులు అరెస్టు చేయడం.. తదనంతర పరిణామాల నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం ఢిల్లీకి పయనమవుతున్నట్లు తెలిసింది. తదుపరి కార్యాచరణలో భాగంగా ఆయన పార్టీ అగ్రనేతలతో సమావేశమవుతారని సమాచారం.

## బీజేపీ కార్యకర్తలపై రేవంత్ సర్కార్ అక్రమ కేసులు

(మొదటిపేజీ తరువాయి)



భయంతో ఆ పార్టీలు వణికిపోతున్నాయని విమర్శించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'అసదుద్దీన్ ఒవైసీ ఫోన్ చేసి చెప్పగానే కాంగ్రెస్ సర్కారు భాజపా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తోంది. బాధ్యతాయుతమైన రాజకీయ పార్టీగా ఓట్లను సరిచూడటానికి ఫారాలు ఇచ్చే హక్కు మాకుంది. చట్టబద్ధ ప్రక్రియను అడ్డుకుంటూ మా కార్యకర్తలపై కేసులు బనాయిస్తే మేం చూస్తూ ఊరుకోం. కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలనే లక్ష్యంతో రాజ్యాంగ సంస్థలపై కుట్రలకు పాల్పడుతోంది. 'సర్' ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు తదితరుల అక్రమ ఓట్లను మాత్రమే తొలగిస్తారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల విష ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు తిప్పికొట్టాలి' అని పిలుపునిచ్చారు.

# ఢిల్లీలో విపక్షాల ఆందోళన ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

సర్కార్‌కు లబ్ధిచేకూరుస్తున్న జ్ఞానేశ్ ఇకనైనా గద్దె దిగాలంటూ నేతలు చేసిన నినాదాలతో దేశ రాజధాని హోరెత్తింది. భారీ సంఖ్యలో విపక్షపార్టీల కార్యకర్తలు సైతం తోడవడంతో అత్యంత సున్నితమైన పార్లమెంట్ పరిసరాలు ఒక్కసారిగా ఉద్రిక్తమయ ఉద్యమవేదికగా మారిపోయింది. పలువురు ముఖ్య నేతలు అరెస్టులు, తర్వాత విడుదలతో విపక్షాల ర్యాలీ ఆద్యంతం ఉద్రిక్తంగా సాగింది. నూతన ఓటర్లు సమర్పించాల్సిన ఫారమ్6కు అనుబంధంగా ఈసీ తీసుకొచ్చిన డిక్లరేషన్‌కు తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదు అని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసిన మరుసటి రోజే 'ఇండియా' కూటమి పార్టీలు ఢిల్లీ వేదికగా ఉద్యమాన్ని ఉధృతంచేయడం గమనార్హం. మంగళవారం ఉదయం 10.30 గంటలకు పార్లమెంట్ ప్రధాన భవనం మకర ద్వారం వద్ద కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, శివసేన, సీపీఐ, సీపీఎం తదితర విపక్ష 'ఇండియా' కూటమి పార్టీల లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఒక్కచోటకు చేరి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం 'నిర్వాచన్ సదన్'కు ర్యాలీగా బయల్దేరారు. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఒబ్రియాన్, సాగరికా ఘోష్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ ఇలా దాదాపు 300 మంది ఎంపీలు ర్యాలీగా బయల్దేరారు. ఆర్ఎస్ఎస్ ఆహార్యంలో ఉన్న జ్ఞానేశ్ కటౌట్‌లను ప్రదర్శిస్తూ 'ఓటు దొంగలు గద్దె దిగాలి', 'ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం ఆపండి' అంటూ ఈసీ, కేంద్రప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. కూటమిలోలేని బిజూ జనతాదళ్ పార్టీ ఎంపీలు సైతం ర్యాలీలో పాల్గొనడం విశేషం. నేతలు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్తుండగా పావు కిలోమీటర్ ముందుకెళ్తే ఎలక్షన్ కమిషన్ హెడ్‌ఆఫీస్ వస్తుందనగా నేతలు నీతి ఆయోగ్ కార్యాలయం వద్దకు రాగానే బారికేడ్లు అడ్డంగాపెట్టి వారిని పోలీసులు అడ్డగించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. పలువురు నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. బారికేడ్లను నెట్టేసి ముందుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు కొందరు నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో రాహుల్ బారికేడ్‌ను ఎక్కేశారు. త్రివర్ణ పతాకం చేతబూని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలుచేశారు. తోటి ఎంపీలు సైతం ముక్తకంఠంతో నినదించడంతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. తర్వాత నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ర్యాలీని కొనసాగనివ్వాలని డిమాండ్‌చేశారు. "జ్ఞానేశ్ జీ ఇప్పటికే ఎన్నికల వ్యవస్థను నాశనంచేశారు. చేసింది చాలు. ఇకనైనా రాజీనామా చేయండి" అని





ఇదే సమయంలో రాహుల్ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. నేతలంతా బైఠాయించడంతో ఉద్రిక్తతలను తగ్గించేందుకు పోలీసులు వెంటనే ఎస్పీ చీఫ్ అఖిలేశ్, ఓబ్రియాన్, అభిషేక్ బెనర్జీ, సాగరికా ఘోష్, మహువా మొయిత్రా, కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ సహా పలువురు ఎంపీలను నిర్బంధించి బస్సుల్లోకి ఎక్కించారు. అయితే బస్సులు కొంతదూరం కదిలినా చుట్టూతా కార్యకర్తల నుంచి తీవ్రస్థాయిలో ప్రతిఘటన ఎదురవడంతో నేతలను విడిచిపెట్టారు. ఇదే సమయంలో ప్రియాంకాగాంధీ ఎలాగోలా బస్సు నుంచి బయటపడి తిరిగి ధర్నాలో కూర్చున్నారు. చెట్టు కింద దాదాపు తొమ్మిది గంటలపాటు కొనసాగిన ధర్నాను రాత్రి వేళ పోలీసులు హఠాత్తుగా భగ్నంచేశారు. ఢిల్లీ పోలీసులు ఒక్కసారిగా పెద్దసంఖ్యలో చుట్టుముట్టి కీలక నేతలందర్నీ లాక్కెళ్లి పోలీస్ వ్యాన్లు, బస్సుల్లోకి ఎక్కించారు. రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా, కె.సురేశ్, అమరీందర్ సింగ్ రాజా వారింగ్, చరణ్‌జీత్‌సింగ్ ఛన్నీ, దీపేందర్ హూడా, ప్రణీతి షిండే, వర్షా గైక్వాడ్, ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, మనీశ్ ఛాత్రా తదితర నేతలందరిన్నీ నిర్బంధంలోకి తీసుకున్నారు. దీంతో అక్కడే ఉన్న విపక్ష పార్టీల మద్దతుదారుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. 50 మంది ఎంపీలుసహా మొత్తంగా 250 మందిని అరెస్ట్‌చేశారు. రాహుల్‌ను కింగ్స్‌వే క్యాంప్ న్యూ పోలీస్‌లైన్స్ స్టేషన్‌కు తరలించారు. ఇతర నేతలను వేర్వేరు వాహనాల్లో అక్కడి నుంచి వేర్వేరు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. విడుదలైన ప్రియాంక తర్వాత రాహుల్‌ను నిర్బంధించిన పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. 2 గంటల నిర్బంధం తర్వాత రాహుల్‌సహా నేతలందర్నీ విడిచిపెట్టారు. నేతల అరెస్ట్‌పై విపక్ష పార్టీలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. అయితే ధర్నా నుంచి డీఎంకే, ఆప్ పార్టీలు దూరంగా ఉండిపోయాయి. అపాయింట్ కోసం లేఖ రాశాకే, సీఈసీని కలిసేందుకే ర్యాలీగా వెళ్లామని ఎంపీలు చెబుతుండగా ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం సాయంత్రందాకా ఎలాంటి అభ్యర్థన రాలేదని ఈసీ వర్గాలు స్పష్టంచేశాయి. పార్లమెంట్ అనుబంధ భవనంలో 240 మంది ఎంపీలు తమతో భేటీకి సిద్ధంగా ఉన్నట్లు పోలీసుల నుంచి సమాచారం అందిందని, ఇలాంటి భేటీకి ఈసీ నిబంధనలను ఒప్పుకోవని ఈసీ పేర్కొంది. ముందస్తు అనుమతితో ఈసీ కార్యాలయంలోనే రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎలక్షన్ కమిషనర్లు భేటీ అయ్యేందుకే నిబంధనలు అనుమతిస్తాయని ఈసీ ఆ ప్రకటనలో పేర్కొంది. ధర్నాను బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా కొత్త 'వీధి నాటకం'గా అభివర్ణించారు. ఎంపీలందరినీ పోలీసులు నిర్బంధించే అవకాశం ఉండటంతో రాహుల్, ప్రియాంక, దీపేందర్ హూడా తదితర ఎంపీలు మధ్యాహ్నం 12.20 గంటల సమయంలో వెంటనే ఎదురుగా ఉన్న ఆకాశవాణి(ఆలిండియా రేడియో కార్యాలయం) ప్రాంగణంలోకి పరుగెత్తారు. మూడో నంబర్ గేటు వద్ద ఉన్న రిసెప్షన్ ఏరియా నుంచి సమీపంలో ఉన్న ఎలక్షన్ కమిషన్ భవనంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ అక్కడే ఉన్న పోలీసులు వాళ్లను అడ్డుకున్నారు. అయినాసరే రాహుల్, ప్రియాంక, తదితరులు లోపలికి చొరబడ్డారు.



## ఏడాదిలోపే లబ్ధిదారులకు ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ఉంది. దీంతోపాటు నియోజకవర్గంలో ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతాం. ఇప్పుడు ఇల్లు రాలేదని ఎవరూ బాధపడొద్దు. విడతలవారీగా ఇస్తూ వెళ్తాం లబ్ధిదారులు వారానికోసారి వచ్చి నిర్మాణ నాణ్యతను పరిశీలించుకోవచ్చు. నాణ్యత లేకపోతే ఫిర్యాదులూ చేయొచ్చు" అని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతుండగా మళ్లీ వచ్చే ఎన్నికల వరకు నిర్మాణాలు పొడిగిస్తూ పోతారని పలువురు అంటున్నట్లు ఓ మహిళ వేదికపై చెప్పగా పొంగులేటి జోక్యం చేసుకొని 'ఏడాది తిరగకముందే ఇక్కడే ఫ్లాట్ తాళం అందిస్తా. ఆ బాధ్యత నాది' అని భరోసా ఇచ్చారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కేవలం ఇళ్లు నిర్మించడమే కాదు.. రోడ్లు, డ్రైనేజీ, ఇతర వనరులు అన్ని సమకూర్చేలా మున్సిపల్ అధికారులతో మాట్లాడి ఒకదాని తర్వాత ఒకటి చేసుకుంటూ వెళ్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, కలెక్టర్ మను చౌదరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆన్‌లైన్ పద్ధతిలో లబ్ధిదారులకు మంత్రి ఫ్లాట్ నంబర్లను కేటాయించారు. తొలివిడత వాయిదా రూ.లక్ష చెల్లించిన పలువురికి ఎన్ఓసీలు అందజేశారు.

స్పందన
తెలుగు దినపత్రిక

# అల్లం సాగు.. అగ్ని పరీక్ష!

## రేటొస్తే అక్షరాలా బంగారమే.. లేదంటే అష్టకష్టాలే!



**జహీరాబాద్ అక్టోబర్ 6 (స్పందన)**

వ్యవసాయ రంగంలో లాభాల బాట ఎప్పుడూ పూలబాట కాదని, అది ముళ్ల కిరీటం వంటి కష్టాలతో కూడుకున్న సాహస యాత్ర అని జహీరాబాద్ మండలంలోని నాగుల కట్టకు చెందిన ప్రగతిశీల రైతు రాజు ప్రయాణం స్పష్టం చేస్తోంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఎల్లప్పుడూ హెచ్చుతగ్గులకు లోనయ్యే మార్కెట్ ధరల మధ్య ప్రతి ఏటా సరికొత్త సవాళ్లను ఎదుర్కొంటూ అల్లం సాగులో ఆయన తిరుగులేని అనుభవాన్ని చాటుకుంటున్నారు. గత పదేళ్లుగా ఈ పంటను నమ్ముకుని నిలకడగా ముందుకు సాగుతున్న ఆయన, ఈ కరీఫ్ సీజన్ లో కూడా తనకున్న అపారమైన అనుభవంతో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పూర్తి స్థాయిలో అల్లం సాగును చేపట్టి స్థానిక రైతులకు ఒక దిక్సూచిలా నిలుస్తున్నారు.

?సాధారణంగా ఆరు నుంచి తొమ్మిది నెలల సుదీర్ఘ కాలపరిమితి కలిగిన ఈ పంట సాగు అంత ఆషామాషీ కాదు. విత్తనం ఎంపిక చేసిన నాటి నుంచి నేలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ, ప్రతి దశలోనూ క్రమం తప్పకుండా తేమను అందిస్తేనే దుంప నాణ్యమైన సైజుకు వస్తుంది. పండించిన అల్లాన్ని మార్కెట్ డిమాండ్, ధరల సరళిని బట్టి సరైన పద్ధతుల్లో రెండు నుంచి మూడు నెలల వరకు నిల్వ చేసుకోవచ్చు. అయితే తగిన శీతల గిడ్డంగి లేదా శాస్త్రీయ నిల్వ వసతులు లేని చోట రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని రాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ మార్కెట్లో అల్లానికి సరైన రేటు లేకుంటే, ఆ పంటను అలాగే ఉంచి మాడం పంటగా అదే భూమిలో ఇంకొక సంవత్సరం కూడా సాగు చేసుకోవచ్చు. దీనివల్ల దుంప మరింత బలంగ తయారవుతుందని ఆయన వివరిస్తున్నారు.

?మరోవైపు ఈ ఏడాది వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పులు, ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపుతున్న విపరీత వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాభావం ఏర్పడి తీవ్రమైన పొడి వాతావరణం నెలకొంది. ఈ



ప్రతికూల పరిస్థితుల వల్ల పంటపై వివిధ రకాల పురుగుల ఉధృతి విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా అల్లం పంటను ఆశించి సర్వనాశనం చేసే దుంప కుళ్ళు తెగులు రైతులను తీవ్రంగా కలవర పెడుతోందని ఆయన తెలిపారు. మొక్కలు అకస్మాత్తుగా ఎండిపోయి దిగుబడి పూర్తిగా దెబ్బతినే ఈ ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొనేందుకు తాము ప్రస్తుతం కేవలం సాధారణ మందులపై ఆధార పడకుండా, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను కఠినంగా అమలు చేస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు నాణ్యమైన పురుగు మందులు, సిఫార్సు చేసిన జీవన ఎరువులను సకాలంలో అందిస్తూ పంటను ప్రాణప్రదంగా కాపాడుకోవాల్సి వస్తోందని వివరించారు.

?ఇక ఆర్థిక కోణంలో చూస్తే అల్లం సాగుకు అయ్యే పెట్టుబడి ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. నాణ్యమైన దుంపల ధర, దున్నకాలు, కూలీల ఖర్చులు మరియు విపరీతంగా పెరిగిపోయి రైతుల వెన్నువిరుస్తున్న పురుగు మందుల వ్యయం కారణంగా ఎకరాకు భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాల్సి వస్తోందన్నారు. అయితే, పెట్టుబడి ఎంత ఎక్కువో, మార్కెట్లో సరైన సమయంలో రేటు పలికితే వచ్చే లాభాలు కూడా అదే స్థాయిలో ఉంటాయని రాజు విశ్లేషిస్తున్నారు. నష్టాలు ఎదురైనా వాటిని ఎదుర్కొనేలా ఈ వ్యాపారంలో రిస్క్ ఉంటుందని ఆయన తెలిపారు. మార్కెట్ పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని, ఒక ఏడాది ధర రాకపోతే మరో ఏడాది వచ్చే భారీ లాభాలు గత నష్టాలన్నింటినీ భర్తీ చేస్తాయన్న గట్టి నమ్మకమే తమకు శ్రీరామరక్ష అని ఆయన స్పష్టం చేశారు. ప్రకృతి ఎంత పరీక్ష పెట్టినా, తెగుళ్లు ఎంత భయపెట్టినా వెనుకంజ వేయకుండా ప్రతి ఏటా క్రమం తప్పకుండా అల్లం సాగు చేస్తూ, మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకుని నిలబడే విధానంపై తోటి రైతులకు ఆయన ఆచరణాత్మక పాఠాలు నేర్పుతున్నారు.



# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్యకర్తను పరామర్శించిన నీలం మధు..

## - యాభై వేల రూపాయలు ఆర్థిక సహాయం..

**పటాన్ చెరు, అక్టోబర్ 6, (స్పందన):**

రోడ్డు ప్రమాదంలో గాయపడి సనత్ నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొల్లారం డివిజన్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నీలం మధు ముదిరాజ్ మంగళవారం పరామర్శించారు. ఆయనకు సంబంధించిన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని, అత్యుత్తమ చికిత్స అందించాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తక్షణ సహాయం కింద యాభై వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. బాధితుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రుడిపై అణు విద్యుదుత్పత్తి!

వియన్నా: అంతరిక్ష పరిశోధన రంగంలో సరికొత్త పోటీ మొదలైంది. అగ్రరాజ్యాలైన అమెరికా, రష్యా, చైనాలు చంద్రుడిపై అణు రియాక్టర్ల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నాయి. చంద్రుడిపై శాశ్వత స్థావరాలు నిర్మించడానికి, వనరులను అన్వేషించడానికి, అంతరిక్షంలోకి మరింత లోతుగా వెళ్లడానికి అణుశక్తి చాలా ముఖ్యమని ఈ దేశాలు విశ్వసిస్తున్నాయి. 'న్యూయార్క్ టైమ్స్' కథనం ప్రకారం... 2030 డిసెంబరు నాటికి చంద్రుడి దక్షిణ ధృవం సమీపంలో నిరంతరంగా పనిచేయగల అణు రియాక్టర్‌ను ఏర్పాటు చేయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు చైనాతో రహస్య భాగస్వామ్యం ద్వారా 2036 నాటికి సెలీనా అనే అణురియాక్టర్‌ను చంద్రుడిపై ఏర్పాటు చేసేందుకు రష్యా వ్యూహ రచన చేస్తోంది. చంద్రునిపై ఉన్న చైనా నేతృత్వంలోని స్థావరాలకు విద్యుత్ అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని తెలుస్తోంది.

**అణు రియాక్టర్లు ఎందుకు?**

చంద్రుడిపై శాశ్వత స్థావరాలు ఏర్పాటుచేసుకోవాలంటే, కచ్చితంగా చాలా విద్యుత్ అవసరం. పగటిపూట సౌరఫలకాలు విద్యుత్‌ను అందిస్తాయి. కానీ చంద్రుడిపై వాతావరణం భూమిపై ఉన్నట్లు ఉండదు. చంద్రుడిపై రాత్రి సమయాలు అధికం కనుక సౌరశక్తిపైనే ఆధారపడడం కష్టం. అణు రియాక్టర్లు సూర్యరశ్మి లేకుండా పనిచేస్తాయి. వాటి నిర్వహణకు పరిమిత స్థాయి మానవ వనరులు చాలు. సుదీర్ఘ కాలం విద్యుత్ సరఫరా చేయగలవు. అందుకే అగ్రదేశాలు అక్కడ అణు రియాక్టర్లను ఏర్పాటు చేయాలని చూస్తున్నాయి. ప్రారంభ దశలో పరికరాలను వేడిగా ఉంచడానికి, చంద్రునిపై ఉన్న వాహనాలకు ఛార్జింగ్ చేయడానికి సౌరశక్తి, రేడియోఐసోటోప్ వ్యవస్థలను ఉపయోగించాలని అమెరికా, చైనాలు యోచిస్తున్నాయి. అయితే, పెద్ద, శాశ్వత స్థావరాలు ఏర్పాటు చేయాలంటే అధిక విద్యుత్ అవసరం అవుతుంది. నాసా ప్రతిపాదించిన లూనార్ రియాక్టర్-1 ఏకంగా 20 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని, నిరంతరాయంగా ఐదేళ్ల పాటు పనిచేస్తుందని అంచనా. రష్యాకు చెందిన సెలెనా రియాక్టర్...10 కిలోవాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, ఒక దశాబ్దం పాటు స్వయంప్రతిపత్తితో పనిచేయడానికి రూపొందించబడిందని తెలుస్తోంది.

**భద్రత ఆందోళనలు**

అగ్రదేశాలు ఒకదానికొకటి పోటీపడుతూ, చంద్రునిపై అణురియాక్టర్లను నిర్మించడానికి ప్రయత్నిస్తుండడంపై శాస్త్రవేత్తలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. రాకెట్ ప్రయోగాల వైఫల్యాలు అణు రియాక్టర్లకు సంబంధించిన ప్రమాదాలకు కారణం కావచ్చని, అది రేడియోధార్మిక పదార్థాలను వ్యాప్తిచేసే అవకాశం ఉందని అంటున్నారు. చంద్రునిపై అణు రియాక్టర్లు ఏర్పాటు చేయడం, నిర్వహించడం సవాళ్లతో కూడుకున్నదేనని హెచ్చరిస్తున్నారు. రియాక్టర్ల నుంచి రేడియేషన్ వ్యాప్తి చెందకుండా పటిష్టమైన భద్రతా నిర్మాణాలు భూమిపై ఏర్పాటు చేయవచ్చు. చంద్రునిపై నిర్మించే అణు రియాక్టర్ల పరిస్థితి వేరు. వ్యోమగాములకు, పరికరాలకు రేడియేషన్ ప్రమాదాలను తగ్గించడానికి, వాటి చుట్టూ ఉన్న ప్రాంతాలను కూడా నియంత్రించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అమెరికా, రష్యాలు తమ రియాక్టర్లను పూర్తి నిష్క్రియాత్మక స్థితిలో చంద్రుడిపైకి పంపాలని ఆలోచిస్తున్నాయి. దీనివల్ల ప్రయాణ సమయంలో ప్రమాదాలు తగ్గుతాయని భావిస్తున్నాయి. అయితే, ఎన్ని భద్రతా చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రమాదాల అవకాశాన్ని కొట్టిపారేయలేమని నిపుణులు అంటున్నారు.

**జాబిల్లిపై హక్కు ఎవరికి ఉంది?**

1967 నాటి అంతరిక్ష ఒప్పందం ప్రకారం, ఏ దేశం కూడా చంద్రుడిని తమ భూభాగంగా చెప్పుకోకూడదు. అయితే చంద్రునిపై ఆయా దేశాలు ఏర్పాటు చేసుకున్న స్థావరాలు, వాటి చుట్టూ ఉన్న ప్రాంతాల్లో ఇతరుల ప్రవేశాన్ని అవి అడ్డుకోగలవా? చంద్రుని ఉపరితలం నుంచి వెలికితీసిన వనరులను తమ సొంతం చేసుకోగలవా? అనే వాటిపై ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి.

చైనా, రష్యాలు నిర్మించే అణు రియాక్టర్ చంద్రుడిపై ఒక నియంత్రిత మండలాన్ని ఏర్పాటుచేసి, తమ వ్యోమగాములు, రోవర్లు ప్రయాణించే ప్రదేశాలను పరిమితం చేస్తాయనే భయందోళనలు అమెరికాకు ఉన్నాయి. అందుకే నాసా తన ప్రణాళికలను వేగవంతం చేసింది.

భద్రతా కారణాల గురించి అమెరికా చెబుతున్నప్పటికీ చంద్రుడిపై అణురియాక్టర్లను ఏర్పాటు చేయడం, అంతరిక్ష ఒప్పందానికి విరుద్ధమని న్యాయనిపుణులు అంటున్నారు. అయితే, ప్రస్తుతం అగ్రరాజ్యాల ఆలోచనలు అన్నీ ప్రతిపాదనల వరకే ఉన్నాయి.

# మునిసిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలి

## 15 సెలవులు పండగ సెలవులు ఇవ్వాలి ఏఐటీయూసీ డిమాండ్....

**జహీరాబాద్ అక్టోబర్06 (స్పందన)**




మునిసిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని మంగళవారం నాడు మునిసిపల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ కి వినతి పత్రం సమర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వెంకటరాజాం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కే నర్సింలు పాల్గొన్నారు. మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫ్లమయ్యారన్నారు. కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని కార్మికులకు రావలసిన హక్కుల్ని హరిస్తున్నారని ప్రభుత్వ జీవోల్ని తుంగలో తొక్కి అధికారులు కార్మికుల కష్టాన్ని కాజేస్తున్నారన్నారు. ఆయన అన్నారు కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని వారికి సబ్బులు నూనెలు చెప్పులు యూనిఫామ్స్ ఇవ్వాలని అదేవిధంగా కార్మికులకు సంవత్సరానికి 15 సెలవులు మంజూరు చేయాలని 8 పండగ సెలవులు ఇవ్వాలని కార్మికులకు పర్మనెంట్ చేయాలని గత ప్రభుత్వం ఎంఎస్ నెంబర్ 68 నీ 30% వేతనాలు పెంచుతూ విడుదల చేయడం జరిగింది 2022 సంవత్సరంలో మరొకసారి కార్మికులకు వెయ్యి రూపాయలు మేడే సందర్భంగా పెరగడం జరిగింది 16.600 లు స్కిల్ కార్మికులకు 20,500 లు హై స్కిల్డ్ కార్మికులకు 22,750 అన్ని విభాగాల్లోనే కార్మికులకు అమలు చేస్తున్నారు రాష్ట్రంలోని మునిసిపాటిల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ వర్క్ ఇన్స్పెక్టర్. డ్రైవర్స్. వాటర్ సప్లై వర్కర్స్ లకు ఫైనాన్స్ డిపార్ట్మెంట్ జీవో ఆర్టీ నెంబర్ 1181ని వేతనాలను తగ్గిస్తూ విడుదల చేయడం జరిగింది ఈ యొక్క జీవోని రద్దు చేయాలి యధావిధిగా పాత పద్ధతిలోనే వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికులకు సిడిఎమ్మె కమిషనర్ రాష్ట్రంలోని కార్మికులందరికి అన్ని విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న వారికి 15 క్యాజువల్ సెలవులు 8 జాతీయ పండుగ సెలవులు వారానికి ఒక వీక్లీ ఆఫ్ అమలు చేస్తామని సర్కులర్ నెంబర్ 1036113/2026/ జి టు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ యొక్క సర్కులర్ ప్రకారం కార్మిక చట్టాల ప్రకారం అమలు చేయాలని ఆయన అన్నారు లేనిపక్షంలో సిడిఎంఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు కార్యక్రమంలో పాల్గొన్న వారు. ఎం నర్సింలు, శేఖర్, రమేష్, అజయ్, నరేష్,

చరణ్, గణేష్, కుమార్, రియాజ్, స్వరాజ్. ముజీబ్, గౌస్, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.



# అనాథల అంత్యక్రియలలో...

## - ఎండిఆర్ ఫౌండేషన్ ఆత్మీయ పాత్ర

## - ఎండిఆర్ మధు కు ఓ సెలబ్రిటీ హోదా...

**పటాన్ చెరు, అక్టోబర్ 6, (స్పందన):**

పటాన్ చెరు నియోజకవర్గ వ్యాప్తంగా అనాధలు ఎవరైనా చనిపోతే ముందుగా గుర్తొచ్చేది ఎండిఆర్ ఫౌండేషన్. రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన గుర్తు తెలియని అనాధ మృతదేహాలకు అంత్యక్రియలకు చెయ్యాలన్నా, చివరకు పోలీసులకు సైతం ఎండిఆర్ ఫౌండేషన్ ముందుగా గుర్తు వస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా అనాధ మృతదేహాలకు సాంప్రదాయ బద్ధంగా, కుటుంబ సభ్యులకు మిన్నగా అంత్యక్రియలు నిర్వహించడంలో ఎండిఆర్ ఫౌండేషన్ తరపున పూర్తి బాధ్యతలు నిర్వహిస్తున్న మధు పలువురికి స్ఫూర్తిదాయకం. కోవిడ్ తో మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహించడంలో



కుటుంబ సభ్యులే ఆమడ దూరంలో నిలిచిన సంఘటనలు కోకొల్లలు. కోవిడ్ తో మరణించిన వారికి సైతం అంత్యక్రియలు నిర్వహించడానికి మేమున్నామంటూ ఎండిఆర్ పూర్తి బాధ్యతలు తీసుకోవడం హర్షనీయం. కోవిడితో మరణించిన వారికి అంత్యక్రియలు నిర్వహిస్తే, డబ్బులు ఇస్తామని కొందరు ఎండిఆర్ ఫౌండేషన్ కు ఆశ చూపిన సందర్భాలు సైతం ఉన్నాయి. కానీ ఎండిఆర్ ఫౌండేషన్ డబ్బులను సున్నితంగా నిరాకరించి, మృతదేహాన్ని తమకు అప్పగిస్తేనే సంప్రదాయ బద్ధంగా ఉచితంగా అంత్యక్రియలు చేస్తామని నిక్కచ్చిగా చెప్పడం ఫౌండేషన్ సభ్యుల ఆత్మస్థైర్యానికి ఓ మచ్చు తునక. కుళ్ళిపోయిన శవాలకు సైతం అంత్యక్రియలు నిర్వహిస్తూ తమదైన శైలిలో మానవతా దృక్పథాన్ని చాటుకోవడం ఎండిఆర్ ఫౌండేషన్ ప్రత్యేకత. ఎంతో పద్ధతిగా అనాధ అమృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఎండిఆర్ మధు కు స్థానికంగా ప్రత్యేకమైన ఓ సెలబ్రిటీ హోదా వినిపిస్తుందటంలో సందేహం లేదు. విసుగు విరామం లేకుండా, రాత్రి పగలు తేడా లేకుండా, ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా అనాధ మృతులకు దహన సంస్కారాలు నిర్వహించడానికి ముందు నిలుస్తున్న ఎండిఆర్ ఫౌండేషన్ కు స్థానికంగా ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉందని చెప్పడానికి సందేహం అక్కర్లేదు.

**అంత్యక్రియలలో ఎనలేని సేవ...**

ఇస్నాపూర్ ఎక్స్ రోడ్ సమీపంలో భిక్షాటన చేస్తూ, జీవనం సాగిస్తున్న ఓ వృద్ధుడు అనారోగ్యంతో రోడ్డుపై పడిపోయాడు. అతడితో ఉన్న తోటి వృద్ధులు గమనించి వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగ చికిత్స పొందుతూ ఆ వృద్ధుడు మృతి చెందాడు. అతడికి సంబంధించిన కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ లేరనే విషయం తెలుసుకున్న ఎండిఅర్ ఫౌండేషన్ వృద్ధుడికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు.

స్పందన
తెలుగు దినపత్రిక


# వెంకీ 'ఏకే 47' విడుదలపై సస్పెన్స్.. అసలు తేదీ ఏది?

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నంబర్ 47' (ఏకే 47) సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. కుటుంబ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని తొలుత 2026 వేసవిలో విడుదల చేయాలని భావించారు. ఆ తర్వాత అక్టోబరు 2కి, అనంతరం అక్టోబరు 9కి విడుదల తేదీని మార్చారు. ఇప్పుడు అక్టోబరు 9న విడుదలపై మరోసారి సందిగ్ధత నెలకొన్నట్లు ప్రచారం జరుగుతోంది. అక్టోబరు 16న వస్తుందా? అక్టోబరు 9న సినిమా విడుదల కాకపోతే ప్రత్యామ్నాయంగా అక్టోబరు 16 తేదీని పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఆ వారాంతంలోనే రజినీకాంత్ నటించిన 'జైలర్ 2', విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న జంటగా తెరకెక్కిన 'రణబాలి' సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి.




# మూడు బ్రేకప్స్.. సుప్రీత సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ నటి సురేఖా వాణి కుమార్తెగా సినీ ప్రేక్షకులకు పరిచయమైన సుప్రీత.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే ఆమె.. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమాల్లోనూ సందడి చేస్తోంది. తాజాగా ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను వెల్లడించింది. తన జీవితంలో ఇప్పటివరకు మూడు ప్రేమ బంధాలు ముగిశాయని తెలిపింది. రెండో ప్రేమతో తీవ్ర ఇబ్బందులు మొదటి ప్రేమను తాను పెద్దగా సీరియస్‌గా తీసుకోలేదని సుప్రీత చెప్పింది. చిన్నతనంలో కలిగిన క్రష్ లాంటిదేనని పేర్కొంది. అయితే రెండో ప్రేమ మాత్రం తన జీవితంపై తీవ్ర ప్రభావం చూపించిందని వెల్లడించింది. దాదాపు రెండున్నరేళ్ల పాటు కొనసాగిన ఆ బంధం తనకు ఎంతో బాధను మిగిల్చిందని చెప్పింది. ఆ సంబంధం నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా దాని ప్రభావం కొంతకాలం కొనసాగిందని తెలిపింది.





# సినిమాలకే గుడ్‌బై చెప్పాలనుకున్న శ్రుతి హాసన్

విలక్షణ నటుడు కమల్ హాసన్ కుమార్తెగా చిన్న వయసులోనే సినీ ప్రపంచానికి పరిచయమైన శ్రుతి హాసన్.. నటిగా, గాయనిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అయితే కథానాయికగా కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో మాత్రం ఆమెకు ఎన్నో సందేహాలు ఎదురయ్యాయట. ముఖ్యంగా తన తొలి హిందీ చిత్రం 'లక్' తర్వాత ఒక దశలో సినిమాలను వదిలేయాలని కూడా భావించినట్లు శ్రుతి గతంలో వెల్లడించింది. చిన్నప్పుడే సినిమాలతో పరిచయం కమల్ హాసన్ నటించిన పలు చిత్రాల్లో బాలనటిగా కనిపించిన శ్రుతి.. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన 'హే రామ్'లోనూ నటించింది. ఇందులో సర్దార్ వల్లభభాయ్ పటేల్ కుమార్తె పాత్రలో కనిపించింది. ఆ పాత్రలో నటించేందుకు తన తండ్రి కమల్ హాసన్ ప్రోత్సహించారని శ్రుతి గతంలో చెప్పింది. అయితే చిన్నతనంలో సినిమాలపై పెద్దగా ఆసక్తి లేకపోయినా.. కుటుంబ నేపథ్యం కారణంగా సినీ వాతావరణాన్ని దగ్గరగా చూసింది. 'లక్' తర్వాత నమ్మకం తగ్గింది 2009లో 'లక్' చిత్రంతో కథానాయికగా శ్రుతి హాసన్ వెండితెరకు పరిచయమైంది. అయితే ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అంతేకాదు.. తెరపై తన నటనను చూసుకున్న తర్వాత శ్రుతి కూడా సంతృప్తి చెందలేదట. తాను సరిగా నటించలేకపోయాననే భావనతో సినిమాల్లో కొనసాగకపోవడమే మంచిదని ఒక దశలో అనుకున్నట్లు తెలిపింది. సినీ రంగం నుంచి తప్పుకోవాలనే ఆలోచన కూడా వచ్చిందని చెప్పింది. పట్టుదలతో స్టార్ హీరోయిన్‌గా అయితే అక్కడితో తన ప్రయాణాన్ని ముగించకూడదని శ్రుతి నిర్ణయించుకుంది. తనలోని నటిని నిరూపించుకోవాలనే పట్టుదలతో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ నటనను మెరుగుపరుచుకుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో వరుస చిత్రాలు చేస్తూ ప్రేక్షకుల్లో గుర్తింపు సంపాదించింది. ముఖ్యంగా తెలుగు చిత్రాల్లో వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. కమర్షియల్ చిత్రాలతో పాటు విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

# సంజయ్ దత్ వివరణ.. ఆ మాటలన్నీ స్క్రిప్టే

బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్ దత్ చేసిన వ్యాఖ్యలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీశాయి. దేశంలో గతంలో ఉన్నంత శాంతి ప్రస్తుతం కనిపించడం లేదంటూ ఆయన ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడంతో సంజయ్ దత్ తాజాగా స్పందించి వివరణ ఇచ్చారు. తాను మాట్లాడిన మాటలు ముందుగానే సిద్ధం చేసిన సంభాషణలో భాగమేనని స్పష్టం చేశారు. గాంధీ జయంతి కార్యక్రమంలో వ్యాఖ్యల గాంధీ జయంతి సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సంజయ్ దత్‌ను దేశంలో ప్రస్తుత పరిస్థితులపై ప్రశ్నించారు. భారతీయులు మంచి మనసున్నవారని, అతిథి మర్యాదల్లో ముందుంటారని పేర్కొన్న ఆయన.. ప్రస్తుతం తనకు గతంలో ఉన్నట్లుగా శాంతి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. దేశంలో శాంతి, ప్రేమ, ఐక్యత నెలకొనాలని కోరుకుంటున్నానని చెప్పారు. అదే కార్యక్రమంలో ఐదు నిమిషాల పాటు ప్రధానమంత్రిగా ఉండే అవకాశం వస్తే ఏం చేస్తారని సంజయ్ దత్‌ను ప్రశ్నించారు.



# మహిళలపై ద్వంద్వ వైఖరిపై సమంత ప్రశ్నలు

నటి సమంత రూత్ ప్రభు మరోసారి సామాజిక అంశంపై తన గళాన్ని వినిపించారు. మహిళల విషయంలో సమాజం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తూ ఆమె సామాజిక మాధ్యమంలో చేసిన ఓ పోస్టు చర్చనీయాంశంగా మారింది. లింగ వివక్ష, పురుషాధిక్యత, మహిళలపై నిందలు వేయడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ సమాజ ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరాన్ని ఆమె సందేశం ద్వారా సూచించినట్లు తెలుస్తోంది. పురుషులను ఎందుకు ప్రశ్నించరు? సమంత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'మనం ఇప్పటికీ మార్పు తీసుకురాగలం' అనే ఆలోచనతో కూడిన సందేశాన్ని పంచుకున్నారు.





# చిరంజీవి-బాలకృష్ణలతో సినిమా.. బోయపాటి కీలక వ్యాఖ్యలు

మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ కలిసి ఒకే సినిమాలో నటిస్తే ఎలా ఉంటుందన్న ఆసక్తి అభిమానుల్లో ఎప్పటి నుంచో ఉంది. గతంలో బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రయాణం వేడుకల్లో చిరంజీవి స్వయంగా దర్శకుడు బోయపాటి శ్రీనుకు ఈ కాంబినేషన్‌పై సవాల్ విసిరారు. ఇద్దరు అగ్ర కథానాయకులతో సినిమా చేయాలని కోరడంతో అప్పటి నుంచి ఈ మల్టీస్టారర్‌పై చర్చ జరుగుతూనే ఉంది. తాజాగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బోయపాటి శ్రీను ఈ ప్రతిష్ఠాత్మక కాంబినేషన్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక ప్రాజెక్ట్ అవుతుందన్న బోయపాటిచిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున తెలుగు చిత్ర పరిశ్రమకు నాలుగు స్తంభాల్లాంటి వారని బోయపాటి పేర్కొన్నారు. అలాంటి ఇద్దరు దిగ్గజ కథానాయకులను ఒకే సినిమాలో చూపించే అవకాశం వస్తే అది తనకు ఎంతో ప్రత్యేకమైన విషయమని అన్నారు. ఇద్దరితో కలిసి సినిమా చేయడం సాధారణ ప్రాజెక్ట్‌లా కాకుండా మరో స్థాయిలో ఉంటుందని అభిప్రాయపడ్డారు. కథ, కాల్‌షీట్లే కీలకం అయితే చిరంజీవి, బాలకృష్ణలను ఒకే సినిమాలోకి తీసుకురావడం అంత సులభమైన విషయం కాదని బోయపాటి తెలిపారు. ఇద్దరు హీరోలకు సమాన ప్రాధాన్యం ఉండేలా కథ సిద్ధం చేయడంతో పాటు.. వారి కాల్‌షీట్లు, పాత్రలు, ఇతర బాధ్యతలను సమన్వయం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కేవలం ఆలోచన ఉంటే సరిపోదని, పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. అభిమానుల కోరిక నెరవేరేనా? చిరంజీవి, బాలకృష్ణలను ఒకే తెరపై హీరోలుగా చూడాలన్నది ఇరు హీరోల అభిమానుల చిరకాల కోరిక. గతంలో వీరిద్దరూ పలు సందర్భాల్లో కలిసి కనిపించినప్పటికీ.. ఒకే సినిమాలో కలిసి నటించడం మాత్రం జరగలేదు. బోయపాటి తాజా వ్యాఖ్యలతో ఈ కాంబినేషన్‌పై మరోసారి ఆసక్తి పెరిగింది. అయితే ఇప్పటివరకు ఈ సినిమాపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం ఇది ఆలోచన, చర్చల దశలోనే ఉంది. భవిష్యత్తులో సరైన కథ, సమయం కుదిరితే ఈ ప్రతిష్ఠాత్మక కలయిక కార్యరూపం దాల్చుతుందేమో చూడాలి.




# రజినీకాంత్‌తో సినిమా ఎప్పుడంటే.. అట్లీ క్లారిటీ

సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ సినిమా చేయనున్నాడంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తలైవాతో సినిమా ఎప్పుడు ఉంటుందనే దానిపై అట్లీ తాజాగా స్పందించాడు. తన సినిమాల మధ్య ఎక్కువ సమయం తీసుకుంటానని, కథ, ప్రణాళిక, చిత్రీకరణపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాల్సి ఉంటుందని చెప్పాడు. నిమా లేనట్టే.. ఓ కార్యక్రమంలో అట్లీ మాట్లాడుతూ.. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో సినిమాను ప్రారంభించకుండా స్క్రిప్ట్, ప్రణాళిక, అమలుపై ఎక్కువ సమయం కేటాయిస్తానని తెలిపాడు. ప్రస్తుతం అల్లు అర్జున్‌తో తెరకెక్కిస్తున్న 'రాకా' చిత్రంతో బిజీగా ఉన్నట్లు చెప్పాడు. ఈ నేపథ్యంలో రజినీకాంత్‌తో తన తదుపరి సినిమా ఎప్పుడు ఉంటుందనేది ఇప్పుడే చెప్పడం కష్టమనే సంకేతాలు ఇచ్చాడు. దీంతో రజినీకాంత్, అట్లీ కాంబినేషన్‌పై వస్తున్న ప్రచారానికి ప్రస్తుతానికి స్పష్టత లభించనట్లయింది. తలైవాతో సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ఇప్పట్లో అలాంటి ప్రాజెక్ట్ ప్రారంభమయ్యే సూచనలు కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రజినీ చేతిలో వరుస సినిమాలు రజినీకాంత్ ప్రస్తుతం నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జైలర్ 2'లో నటిస్తున్నాడు. ఈ సినిమా అక్టోబరు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ధర్మన్'లోనూ ఆయన నటిస్తున్నారు. 'రోబో'కు అట్లీ అసిస్టెంట్ డైరెక్టర్ రజినీకాంత్‌తో అట్లీకి గతంలోనే ఓ ప్రత్యేక అనుబంధం ఉంది. శంకర్ దర్శకత్వంలో రజినీకాంత్ హీరోగా తెరకెక్కిన 'రోబో' చిత్రానికి అట్లీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. దీంతో భవిష్యత్తులో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందా? అనే ఆసక్తి అభిమానుల్లో కొనసాగుతోంది.

Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780